## క్లుప్తంగా

### పంట బీమా చేయించుకోండి

సంతకవిటి: రైతులు తాము సాగు చేస్తున్న పంటలకు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సి.బి.యశ్వంత్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్ పంటలకు సంబంధించి రైతులు బీమా ప్రీమియం చెల్లించేందుకు రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ తేదీ లను ప్రకటించిందని తెలిపారు. మొక్క జొన్న పంట సాగు చేస్తున్న వారు ఈనెల 31వ తేదీలోగా వరి సాగు చేసే వారు ఆగస్ట్15 తేదీలోగా ప్రీమియం చెల్లించాలని సూచించారు.

### విద్యార్థులకు వైద్యపరీక్షలు



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ అసిరినాయుడు

రేగిడి: ఉంగరాడమెట్ట వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 275 మంది విద్యార్థులకు రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అసిరినాయుడు, వైద్య సిబ్బంది గురువారం వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేసి, ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు.ఉదయం, సాయంత్రం రెండుపూటలా తప్పనిసరిగా స్నానం చేయాలని, ఉతికిన దుస్తులను మాత్రమే వేసుకోవాలని చెప్పారు. విద్యార్థులకు వేడి ఆహార పదార్థాలతోపాటు కాచి, చల్లార్చిన నీటిని అందజేయాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావుకు సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్ రమణ, గురుకుల పాఠశాల హెల్త్ అసిస్టెంట్ తాడేల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలకు వితరణ



విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందిస్తున్న దాత సత్యనారాయణగుప్త

రాజాం: మండలంలోని వి.ఆర్.అగ్రహారం ప్రాథమిక పాఠశాలకు రాజాం పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త పొట్నా సత్యనారాయణ గుప్త స్టీల్ వాటర్ డ్రమ్, ప్లాస్టిక్ బకెట్‌లు, రెండు కుర్చీలు వితరణ చేశారు. అలాగే విద్యార్థులకు భోజన ప్లేట్లు గ్లాసులు అందజేశారు. దాతకు పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ డి.వెంకటరమణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### గురువులకు సత్కారం



సత్కారం పొందిన ఉపాధ్యాయులు

బొబ్బిలి:పట్టణ రోటరీ క్లబ్‌లో సభ్యత్వం ఉండి ఉపాధ్యాయులుగా పని చేస్తున్న పలువురిని గురుపౌర్ణమి సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. ఉపాధ్యాయులు జె.సి.రాజు, చుక్క శ్రీదేవి,ప్రవీణ్‌కుమార్, అప్పలరాజు, శివకాంత్, కృష్ణమోహన్‌ను రోటరీ క్లబ్ సభ్యులు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈసందర్భంగా రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జె.సి. రాజు, బొబ్బిలి క్లబ్ అధ్యక్షుడు వి.శ్రీహరి మాట్లాడుతూ గురువే జ్ఞాన ప్రదాత అని, గురువులు చెప్పింది మనస్ఫూర్తిగా స్వీకరిస్తే జ్ఞానసంపన్నులవుతారన్నారు.

### తాగునీటి పరీక్షలు తప్పనిసరి



కంచరాంలో తాగునీటి నాణ్యత పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: గ్రామాల్లో ప్రతీ 15 రోజులకు ఒక దఫా తాగునీటి పరీక్షలు చేయాలని, నాణ్యతపై ప్రజ లను అరాతీయాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కంచరాం, ఒమ్మి తదితర గ్రామాల్లో తాగునీటి బోరు బావులు, కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీటిని గురువారం పరిశీలించారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేయాల ని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

### నాయకత్వం అంటే బాధ్యత

బొబ్బిలి: నాయకత్వం అంటే ఓ బాధ్యతగా గుర్తెరిగిన నాడే సమాజానికి మేలు జరుగుతుందని సీఐ కె.సతీష్‌కుమార్ అన్నారు.పట్టణంలోని నారాయణ స్కూల్‌లో గురువారం నాయకత్వ నియామకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులకు నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నారా యణ విద్యాసంస్థల రీజనల్ ఇన్‌చార్జి ఎస్.రాజేష్ కుమార్,ప్రిన్సిపాల్ ఎస్.త్రినాథరావు, మానవ హక్కుల కమిషన్ జిల్లా చైర్‌పర్సన్ జి.మానస,తదితరులు పాల్గొన్నారు.

- వంకర టింకరగా రాజాం ప్రధాన రహదారి విస్తరణ పనులు
- అధికారుల తీరుపై అనుమానాలు
- కొంతమంది పెద్దల కోసం మున్సిపల్ స్థలాలు ఎరగా పెట్టిన వైనం

# ప్లాన్ ప్రకారమే మలుపులు..!




జేజే ఇన్నోటెల్ సమీపంలో హెచ్చుతగ్గులతో రోడ్డు విస్తరణ, డ్రైన్ నిర్మాణం

రాజాం: రాజాం ప్రధాన రహదారి విస్తరణలో తెర వెనుక జరుగుతున్న కథలు ఆలస్యంగా వెలుగులోకి వస్తున్నాయి. పైసాల మత్తులో అధికారులు అడ్డంకులు సృష్టించడం అనంతరం వాటికి అవే పరిష్కారం కావడం యధేచ్ఛగా జరిగిపోతున్నాయి. రోడ్డు విస్తరణ జాప్యానికి ఇవి కూడా అదనపు కారణాలుగా కనిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో 70శాతం మేర పనులు పూర్తి చేయగా, కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఈ రహదారి విస్తరణ పూర్తి కాకపోవడానికి ఇటు అధికారుల వ్యవహారం, అటు పాలకుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రహదారి విస్తరణ కోసం 80 అడుగుల మేర కొలతలు తీశారు. అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ఐటీ వరకు, అలాగే బొబ్బిలి జంక్షన్ నుంచి గాయత్రీకాలనీ వరకు అప్పట్లోనే కొలతలు వేసి స్థలసేకరణ పూర్తి చేసి, ఇరువైపులా అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ఐటీ వరకు పాలకొండ రోడ్డులో చేస్తున్న పనులకు పలుచోట్ల రోడ్డు పక్కన ఉన్న భూయజమానులతో అడ్డంకులు వచ్చా యి. గతంలో కొలతల ప్రకారం రోడ్డు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన వారే ఇప్పుడు ఎందుకు అడ్డంకి పెడుతున్నారో ఎవరికీ అర్థం కావడం లేదు. అలానే బొబ్బిలి జంక్షన్ నుంచి గాయత్రీకాలనీ వరకు కూడా ఇలానే ఒకటి రెండు చోట్ల రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు ఎదురయ్యాయి. నెమ్మదినెమ్మదిగా ఇవి పరిష్కారమయ్యాయి. ఇప్పుడు ఈ ప్రాంతాల్లో అండర్ డ్రైనేజీ నిర్మాణం చూస్తే ఆయా భూయజమానుల స్థలాలు కోత తగ్గి, వాటి ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూములు, ఇతర సామాన్యుల భూముల్లో కోతలు పెరిగాయి. డోలపేట చెక్ పోస్టు వద్ద ఈ తంతు మరీ ఎక్కువగా కనిపిస్తోంది. ఎస్‌బీఐ ప్రాంతంలో అండర్ డ్రైనేజ్ నిర్మాణం పూర్తిగా ముందుకు వచ్చేసింది. అక్కడ వరకు తిన్నగా వచ్చిన డ్రైన్ ఒక్కసారిగా మలుపుతిరిగింది. డ్రైన్ నిర్మాణం వీటికి ఎదురుగా ఉన్న మున్సిపల్ స్థలాల్లోకి వెళ్లి వంకరగా మారింది. ఇక్కడే మున్సిపల్ అధికారుల తీరుపై పట్టణవాసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఎస్‌బీఐ బ్రాంచి ఉన్న భవనంతో పాటు మరో ఇద్దరు ముగ్గురు వద్ద పైసాలు తీసుకుని, ఎదురుగా ఉన్న మున్సిపల్ స్థలాల్లోకి రోడ్డును వంకరగా తిప్పారని ఆరోపిస్తున్నారు. ఇలాంటి వంకరలు ఇక్కడే కాకుండా అటు బొబ్బిలి జంక్షన్ నుంచి గాయత్రీ కాలనీ వరకు కూడా కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో శ్రీకాకుళం రోడ్డులో చేపట్టిన పనుల్లో ఇటువంటి వంకరలు ఎక్కడా రాలేదు. ఇలా భారీ విస్తరణ రోడ్డు గ్రామీణ లింకు రోడ్ల మాదిరి వంకరలుగా ఉండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



డోలపేట చెక్‌పోస్టు సమీపంలో ముందుకు వచ్చిన డ్రైనేజీ నిర్మాణ



ప్రభుత్వ స్థలాల్లో లోపలకు వెళ్లిన రోడ్డు నిర్మాణ కొలతలు

**వివాదాలు లేకుండా చూస్తున్నాం..**

రాజాం ప్రధాన రహదారి విస్తరణలో ఎటువంటి వివాదాలు లేకుండా చూడాలని ప్రయత్నిస్తున్నాం. అధికారులకు ఇందులో ఎక్కడా కూడా ఎలాంటి లాభాపేక్ష లేదు. డోలపేట చెక్ పోస్టుతో పాటు పలుచోట్ల ప్రభుత్వ, దేవదాయశాఖ భూములకు ఇబ్బందులు వచ్చాయి. వీటిని ప్రభుత్వం తరపున నష్టంగా భావించి ముందుకెళుతున్నాం. అండర్ డ్రైనేజీల నిర్మాణంలో నాణ్యత ఆర్అండ్‌బీ శాఖ పర్యవేక్షిస్తుంది.

– జె.రామప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్, రాజాం

# అభినందన



విద్యార్థి సిద్ధూకు నగదు ప్రోత్సాహం అందజేస్తున్న హెచ్‌ఎం శ్రీదేవి, తదితరులు

తెర్లాం: అతి తక్కువ ఖర్చుతో బ్యాటరీతో నడిచే సైకిల్‌ను రూపొందించిన మండలంలోని జె.కొత్తవలసకి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి రాజపు సిద్ధూను పెరుమాళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు. గురువారం ఆ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని సత్క రించి, హెచ్‌ఎం తన సొంత నిధుల నుంచి రూ.10వేలు అందజేశారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లా డుతూ సిద్ధూ తమ పాఠశాల విద్యార్థి కావడం గర్వంగా ఉందని అన్నారు. తమ పాఠశాలలోనే 10వ తరగతి వరకు చదువుకున్నాడని, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్లలో పాఠశాల తరపున పాల్గొని ప్రతిభ కనబరిచాడని, మరిన్ని ఆవిష్కరణలు చేయాలని ఆకాంక్షించారు. పెరుమాళి, గోపాలవలస నాయకులు అప్పలనర్సింహరాజు, వెంకటరావు, శివాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎంపీపీ లక్ష్మికి పితృవియోగం



శ్రీరాములునాయుడు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి,తదితరులు, (ఇన్‌సెట్లో) కొల్లిశ్రీరాములునాయుడు(ఫైల్)

బొబ్బిలిరూరల్: పిరిడి పీఏసీఎస్ మాజీ ప్రెసిడెంట్,వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, బొబ్బిలి ఎంపీపీ శంబంగి లక్ష్మి తండ్రి కొల్లి శ్రీరాములునాయుడు(80) బుధవారం రాత్రి అనారోగ్యంతో తన స్వగ్రామంలో పిరిడిలో మృతి చెందారు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు,ఇద్దరు కుమారులు కాగా ఒక కుమారుడు మృతి చెందారు. శ్రీరాములునాయుడు భౌతిక కాయానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు, శ్రీరాములునాయుడి అల్లుడు,జిల్లా వైఎస్సార్‌సీపీ జనరల్ సెక్రటరీ శంబంగి వేణుగోపాలనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మాజీ మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి బొద్దల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తమ్మిరెడ్డి దామోదరరావు, కమ్మవలస సర్పంచ్ వసుంధర, వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు శ్రీరాములునాయుడు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంఈఓ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వంట నిర్వాహకులు

రాజాం సిటీ: ప్రభుత్వం తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) నిర్వాహకులు డిమాండ్ చేశారు. మండ లంలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు కార్మిక సంఘాల గౌరవ అధ్యక్షుడు సీహెచ్.రామ్మూర్తినాయుడుతో కలిసి ఎమ్మార్సీలో ఎంఈఓ పి.ప్రవీణ్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ వంట నిర్వాహకులకు గౌరవ వేతనం రూ.10 వేలు ఇవ్వాలని, బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నెలవారీ వేతనాలు, మెనూ బిల్లులు రాకపోయినా అనేక ఇబ్బందులు పడి వంట ఏజెన్సీలు నిర్వహిస్తున్నవారిపై ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరైన పద్ధతి కాదని అన్నారు. మెనూ చార్జీలు పెంచకుండా బియ్యం, గుడ్లు ఇచ్చి పిల్లలకు పౌష్టికాహారం అందించాలంటే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. వంట నిర్వాహకులు హైమావతి, రమణమ్మ, ఇందుమతి, పార్వతి, చంద్ర, సంతోషి, లక్ష్మి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి



మహిళా పోలీసులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ రాఘవులు

రాజాం సిటీ: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, నిఘా పటిష్టం చేయాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు సూచించారు. రాజాం టౌన్ సర్కిల్ కార్యాలయంలో మండలంలోని గ్రామ సచివాలయాల మహిళా పోలీసులతో గురువారం సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా ఎప్పటికప్పుడు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని చెప్పారు. తగాదాలు, అసాంఘిక కార్యక్రమాలు జరిగితే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



బొబ్బిలిరూరల్: పిరిడి ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యారెడ్డి

బొబ్బిలిరూరల్: విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరం తరం కృషి చేయాలని డీఎస్పీ భవ్యారెడ్డి సూచించారు. మండలంలోని పిరిడి ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి డీఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల నడవడిక, ప్రవర్తనపై దృష్టిపెట్టాలని, సెల్‌ఫోన్లు, ఖరీదైన మోటారు బైక్‌లు ఇవ్వవద్దని హితవుపలికారు. విద్యార్థుల జీవితంలో ప్రతీ అంశంలో గురువులు, తల్లిదండ్రుల పాత్ర ఉంటుందన్నారు.హెచ్‌ఎం మధుసూదనరావు,సర్పంచ్ తుట్ట వరలక్ష్మి ,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**విద్యార్థుల నడవడికపై శ్రద్ధ వహించాలి**

రేగిడి: విద్యార్థుల నడవడికపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని విజయనగరం జిల్లా గురుకులాల సమన్వయాధికారి ఎస్.రూపవతి అన్నారు. ఉంగరాడమెట్ట వద్ద ఉన్న గురుకుల పాఠశాల/కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్స్ సమావేశానికి ఆమె అతిథిగా హాజరయ్యారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో కల్పించిన సౌకర్యాలను వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం తల్లిదండ్రులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ పక్కి శ్యామల, జి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కోర్సులకు దరఖాస్తులాహ్వానం

బొబ్బిలి: ఉచిత ఉపాధి కోర్సులకు అర్హులు దరఖాస్తు చేసుకోవా లని నిర్మాణ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక సీఈఓ మయూర్ పట్నాల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై, 28 సంవత్సరాల లోపు వయసున్న నిరుద్యోగ యువతకు టైపింగ్ స్కిల్స్,ఎంఎస్ ఆఫీస్,ఇంటర్నెట్ కాన్సెప్ట్స్,కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్ కోర్సులపై నెల రోజుల చొప్పున శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని, అలాగే విశాఖపట్నంలోని ఎన్ఏడీ బాజీ జంక్షన్‌లో ఉన్న కార్యాలయాన్ని నేరుగా కానీ, 95028 74304, 9908 10411నంబర్లను కానీ ఈనెల 14లోగా సంప్రదిం చాలని సూచించారు.

## సంక్షిప్తంగా...

### ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయుడు మింది రామకృష్ణను సన్మానిస్తున్న గ్రామస్తులు

బొబ్బిలి రూరల్: మెట్టవలస ఉన్నత పాఠశాలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన, బదిలీ అయిన ఉపాధ్యాయులను సర్పంచ్ పువ్వల మాధవరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

**డ్రమ్ సీడ్ విధానంతో ప్రయోజనాలు**

తెర్లాం: డ్రమ్ సీడ్ విధానంలో వరి విత్తనాలను విత్తుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి(ఏఓ) బొత్స శ్రీనివాసరావు అన్నారు. లోచర్ల గ్రామంలో రెడ్డి గౌరినాయుడు అనే రైతు పొలంలో డ్రమ్ సీడ్ విధానంలో గురువారం వరి విత్తనాలు వేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ డ్రమ్ సీడ్ విధానంలో వరి విత్తనాలు వేయడం ఎంతో మంచిదని, కూలీల ఖర్చులు ఆదా కావడంతోపాటు, దిగుబడి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఏఈఓ వెంకటేష్, ఉద్యానవన సహాయకురాలు హరిత పాల్గొన్నారు.

**రోడ్డుపై గోతులు పూడ్చిన పోలీసులు**



బాడంగిలో రోడ్డుపై గోతుల పూడ్చివేత పనులు చేయిస్తున్న పోలీసులు

బాడంగి: మండల కేంద్రంలోని మార్కెట్ ప్రాంతంలో ప్రధాన రహదారికి ఎస్ఐ తారకేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గురువారం మరమ్మతులు చేయించారు. క్వారీ బుగ్గి తీసుకువచ్చి రోడ్డుపై గోతులను పూడ్చే పనులు చేపట్టారు. పోలీసులకు ప్రయాణికులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పలుగ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. షిర్డీ సాయిబాబా, తదితర ఆలయాల్లో ప్రత్యేకపూజలు, అభిషేకాలు, వ్రతాలు చేశారు. పలు గ్రామాల్లో అన్నదానం చేశారు. సాయంత్రం షిర్డీ సాయి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. సంతకవిటి మండలంలోని చిన్న సిరిపురం గ్రామ శివాలయంలో ప్రకాశానందస్వామి ఆధ్వర్యంలో, రేగిడి మండల కేంద్రంలోని దత్తాశ్రమంలో పాలకొండకు చెందిన సత్య సాయి సేవాసమితి ప్రతినిధి ఎన్.వి.రమణ, ఆధ్వర్యంలో సత్సంగం నిర్వహించారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో గురువులను సత్కరించారు. వక్తలు గురువుల గొప్పతనాన్ని వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



బాడంగి: ముగడలో సామూహిక వ్రతాలు చేస్తున్న మహిళలు



రాజాం: పొగిరిలో షిర్డీసాయి ఉత్సవమూర్తుల ఊరేగింపు



బొబ్బిలి: ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల షిర్డీ సాయి ఆలయంలో భక్తుల పూజలు



రామభద్రపురం: మండల కేంద్రంలోని ఆలయంలో షిర్డీ సాయిబాబా విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, దంపతులు



రేగిడి: సంకిలిలోని షిర్డీసాయి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



సంతకవిటి: గరికిపాడు షిర్డీసాయి ఆలయంలో సాయి వ్రతాలు చేస్తున్న భక్తులు.



రాజాం సిటీ: యోగా గురువు టి.టి.వి.రమణమూర్తి దంపతులను సత్కరిస్తున్న రాజాం వికాసతరంగిణి సభ్యులు



రేగిడి: మండల కేంద్రంలోని దత్తాశ్రమంలో ఆధ్యాత్మిక వక్త ఎన్.వి.రమణను సత్కరిస్తున్న నిర్వాహకులు

# సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు



గోతులను కప్పిస్తున్న మాజీ ఎంపీపీ వేంకటేశ్వరరావు

తెర్లాం: మండల కేంద్రంలో నుంచి రామమందిరం వద్ద బొబ్బిలికి వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డుకు మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రతినిధి నర్సుపల్లి వెంకటేశ్వరరావు తన సొంత నిధులతో గురువారం మరమ్మతులు చేయించారు. స్టోన్ చిప్స్, కంకర తెప్పించి గోతుల్లో పోయించారు. వాహన చోదకులు, గ్రామస్తులు వేంకటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.